క్లుప్తంగా

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు

సీఎస్‌పురం(పామూరు): పశువులకు గాలికుంటు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని ఏడీఏ ఆర్.రమేష్ అన్నారు. సీఎస్‌పురంలో శనివారం డాక్టర్ షేక్.మునీర్ 95 గేదెలకు గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఆదినారాయణ, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

కనిగిరిరూరల్: మండలంలోని దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వట్టివేళ్ల రంగబాబు పరీక్షా సామగ్రిని అందచేశారు. పాఠశాల హెచ్‌ఎం వెన్నల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎంఈఓ సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య అన్నారు. మండలంలోని వాలిచర్ల, మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు దాతలు పరీక్ష సామగ్రి అందజేశారు.

ఘనంగా పాఠశాల రజతోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని పచ్చవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్‌కుమార్ విద్య ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి ఉన్నత స్థానాలకు ఏ విధంగా చేరుకోవాలో వివరించారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసారు. సర్పంచ్ కె.కృష్ణ, డాక్టర్ కొమ్మి నరశింగరావు, ప్రధానోపాధ్యాయుడు ఏ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కార్డుదారునికి రేషన్ అందాలి



మొబైల్ రేషన్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ప్రతి కార్డుదారునికి తప్పనిసరిగా రేషన్‌ను అందజేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మొబైల్ రేషన్ పంపిణీ వాహనాన్ని శనివారం చైర్మన్ గఫార్ తనిఖీ చేశారు. చైర్మన్ గఫార్ కార్డు దారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఎండీయూ ఆపరేటర్లు కొలతల్లో తేడాలు చేసినా.. సరుకులు సక్రమంగా ఇవ్వకపోయినా చర్యలు ఉంటాయని చైర్మన్ గఫార్ హెచ్చరించారు.

ఉచిత బస్సు ఉత్తిదేనా..?



ఆర్టీసీ బస్సులు



మహిళలు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సర్కార్ మీనమేషాలు
- తాజాగా బడ్జెట్‌లోనూ రూపాయి కూడా కేటాయించని ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై మహిళల మండిపాటు
- నియోజకవర్గంలో 1.18 లక్షల మంది మహిళా ఓటర్లు

కనిగిరిరూరల్:

అధికారంలోకి రాక ముందు అలివిమాలిన హామీలివ్వడం..అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అటకెక్కించడంలో చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళల ఓట్ల కోసం అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఆర్భాటంగా హామీలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఆ పథకం ఊసే లేదు. అడపా దడపా ఒకరిద్దరు నేతలు త్వరలో.. త్వరలో అంటూ ప్రకటనివ్వడమే గానీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో మహిళలు కూటమి సర్కార్‌పై సర్వత్రా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కరువు సీమ కనిగిరిలో కూలీలు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు అధికం. నియోజకవర్గంలోని 170 రెవెన్యూ గ్రామాల నుంచి నిత్యం ఆస్పత్రులకు, కూలీ పనులకు, కాలేజీలకు, చిరు వ్యాపారాలకు, మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వారి ఉచిత బస్సు ఎంతో ఉపయోగపడుతుందని ఆశపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలల అవుతున్నా వారి ఆశలు నెరవేర లేదు. దీంతో ప్రభుత్వంపై వారంతా తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలయాపనతో సరి..

కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల అవుతున్నా.. సూపర్ సిక్స్ పథకాల అమలుకు అడుగు పడలేదు. దాదాపు సూపర్ సిక్స్‌కు సున్నం పెట్టే విధంగా సీఎం చంద్రబాబు పలు చోట్ల వ్యాఖ్యలు చేశారు. అంతేగా మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఉచిత బస్సు తుస్సుమన్నట్లేననిపిస్తోంది. దసరా, దీపావళి, సంక్రాంతి, అంటూ కప్పదాటు వైఖరితో ఉన్న టీడీపీ సర్కార్‌పై మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. పండగలన్నీ వెళ్తున్నా.. ఉచిత బస్సు మాట మాత్ర నోటిలో నుంచి రోడ్డు ఎక్కడం లేదని మహిళలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

1,18 లక్షల మంది మహిళల ఎదురుచూపు

కనిగిరి నియోజకవర్గంలో 1,18,710 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. హనుమంతునిపాడులో మండలంలో 11,482 మంది, వెలిగండ్ల మండలంలో 13,978మంది, సీఎస్‌పురం మండలంలో 16,859 మంది, కనిగిరి మండలంలో 36,051 మంది, పీసీపల్లి మండలంలో 14,462 మంది, పామూరు మండలంలో 25,878 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు జరిగితే వీరంతా అర్హులే. నియోజకవర్గంలోని దాదాపు 70 శాతం గ్రామాలకు చెందిన రూట్లకు ఆర్టీసీ బస్సులు వెళ్తున్నాయి. ఆయా గ్రామాల నుంచి నిత్యం మహిళలు ప్రయాణాలు సాగించేందుకు ఉపయోగం కల్గుతుంది. పథకం అమలు చేస్తే ఎంతో మంది మహిళలు లబ్ధి పొందుతారు.

తక్షణం హామీని అమలు చేయాలి:



ఉచిత బస్సు పథకం అమలు చేస్తే నియోజకవర్గంలోని అనేక మంది మహిళలకు ఉపయోగ పడుతుంది. నియోజకవర్గం నుంచి జిల్లాలోని పలు గ్రామాలకు, పట్టణాలకు నిత్యం మహిళలు కూలి పనులకు, ఇతర వృత్తి పరమైన పనులకు వెళ్తుంటారు. విద్యార్థినులు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వారందరికీ ఉచిత బస్సు పథకం ఎంతో లబ్ధి చేకూర్చుతుంది. కూటమి సర్కార్ కసరత్తు పేరుతో కాలయాపన చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు, కూటమి నేతలు వ్యాఖ్యానించడం సరైంది కాదు. తక్షణమే మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలి.

ఏ నాగమణి (వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షురాలు)

హామీ నిలబెట్టుకోవాలి:



మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిస్తామని కూటమి సర్కార్ చెప్పిన హామీని నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు దాటినా.. ఎప్పటి నుంచి అమలు చేస్తారనే మాట కూడా జారడం లేదు. ఇతర రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశారు. మన రాష్ట్రంలో సూపర్ సిక్స్‌కు ఎగనామం పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎం భారతి, మహిళా సంఘ నాయకురాలు

బడ్జెట్‌లో వెలిగొండకు తీవ్ర అన్యాయం



పామూరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పామూరు: బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఐ శ్రేణులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రాజెక్ట్ నిర్మాణానికి రు.379 కోట్లు, ఆర్ ఆర్ ప్యాకేజీకింద రు.116 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. వజ్రాల సుబ్బారావు, సయ్యద్ మౌలాలి, ప్రసాద్, రాగిపాటి సూరిబాబు, ఆకుల మోహన్‌రావు, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్ట్‌కు రు.2 వేల కోట్లు కేటాయించాలి

సీఎస్‌పురం(పామూరు): పశ్చిమ ప్రాంత వరప్రసాదిని వెలిగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయింపును నిరసిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీపీఎంనాయకుడు ఊసా వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకుడు షై పెదమస్తాన్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు.

కనిగిరిరూరల్: వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, ఎస్‌కే బషీరా, ఏడుకొండలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ఆదిత్య కళాశాల పరీక్షా కేంద్రంవద్ద వేచిటున్న విద్యార్థులు



పొన్నలూరులో పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు

పామూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు 735 మంది విద్యార్థులకు గాను 58 మంది గైర్హాజరు కాగా 677 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఈసీ కమిటీ కే.ఆంజనేయులు, పి.కోటేశ్వరరావు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

సీఎస్‌పురం(పామూరు): స్థానిక కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 105 మంది విద్యార్థులు తొలి రోజు ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 93 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు.

కొండపి: స్థానిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షకు 297 మంది హాజరయ్యారు. తొలి రోజు 316 మంది హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరయ్యారు.

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 85 మందికి గాను 3 విద్యార్థులు గైర్హాజరయ్యారు. తెలుగు పరీక్షకు సెట్ నంబర్ 2 ప్రశ్నాపత్రాన్ని అందజేయగా, పరీక్షల సందర్భంగా కళాశాల ప్రాంగణంలో 144 సెక్షన్ విధించి ఎస్సై కట్టా అనూక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షల చీఫ్‌గా కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు, డీఓగా బి. రవీంద్ర పర్యవేక్షించారు.

టంగుటూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాని చీఫ్ సూపరింటెండెంట్ సౌజన్య తెలిపారు. తొలి రోజు 182 మంది హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారు.

కనిగిరిరూరల్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంఎస్ఆర్, జీజేసీ, ఎంఎస్ఎం, నేతాజీ, కృష్ణా చైతన్య కళాశాలల సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



దిరశవంచ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు



వల్లూరులో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కనిగిరిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంఈఓలు జి.సంజీవి, ఉండేల వెంకట నారాయణరెడ్డి, రాచమడగు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ వి.రంగబాబు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ గారపాటి సుబ్బారావు, డాక్టర్ గర్రె రవీంద్రనాథ్, ఏఈ హబీబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన కాలే శ్రీనివాసరావు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఆటపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తొలుత విద్యార్థులతో సరస్వతి పూజ చేయించారు.

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెం జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, హెచ్‌ఎం శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాళ్లమ్మతల్లి తిరునాళ్ల

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి అడవిలో వెలసిన అడవి పేరంటాళ్లమ్మ తల్లి తిరునాళ్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అడవిలో నుంచి గ్రామంలోకి ఊరేగింపుకు తీసుకువచ్చి బొల్లావులు మేళతాళాలతో ఊరేగించి పూజలు చేశారు. దూరప్రాంతాల నుంచి పలువురు తిరునాళ్లకు హాజరై మొక్కలు తీర్చుకున్నారు. అదే విధంగా నేరేడుపల్లిలో వెలసిన అడవి పేరంటాళమ్మ తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి పూజలు చేశారు.

బడ్జెట్‌లో మహిళలకు నిరాశ



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి.

కొండపి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మహిళలను నిరాశపరిచిందని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. పెరిదేపిలోని ఎమ్మెస్ విజ్ఞాన కేంద్రంలో శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార కూటమీ పార్టీలు ఎన్నికలకు ముందుగా మహిళలకు అనేక వరాలు ప్రకటించడంతో మహిళలు పెద్ద ఎత్తున కూటమికి ఓట్లు వేశారని తెలిపారు. బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించకుండా ఆ పథకాలు ఎట్లా అమలు చేస్తారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీకి సంబంధించి ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడాన్ని మండిపడ్డారు. ఇక మహాలక్ష్మి పథకం, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకానికి, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇలా ఏ పథకానికి ఒక్క రూపాయి కేటాయించకుండా మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఐద్వా మండల కార్యదర్శి అంగలకుర్తి మాధవి, ఎల్.కోటేశ్వరి, ఎస్.అంజలి పి.నాగలక్ష్మి, కె.విజయమ్మ, బి.అరుణ పాల్గొన్నారు.

కూలీల ఆటో బోల్తా



పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం మధ్యలో బోల్తా కొట్టిన కూలీల ఆటో



ప్రమాదస్థలంలో కూలీలు

- ఏడుగురికి గాయాలు
- 108లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలింపు

పొన్నలూరు: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం మధ్యలో ఓవీ రోడ్డుపై శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, బసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 30 మంది మహిళా కూలీలు పొన్నలూరు మండలం ఎదురువారిపాలెంలో శనగ కోతకు ట్రాలీ ఆటోలో బయలుదేరారు. ఆటో పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం మధ్యలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అందులోని 30 మంది కూలీలు చెల్లాచెదరుగా పడిపోయారు. అలాగే పి.భూదేవమ్మ, డి.శాంతమ్మ, నరసమ్మతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సమాచారం అందించడంతో క్షతగాత్రులను చికిత్స కోసం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయాలపాలైన వారిలో శాంతమ్మ తల నరాలు దెబ్బతిని శరీరం సచ్చుపడటంతో మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి గుంటూరుకు తరలించారు. భూదేవమ్మకు కూడా వెన్నెముక భాగం దెబ్బతినడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. మంచు కురుస్తూ తెల్లవారు జాము కావడంతో రోడ్డు సరిగా కనిపించక ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టినట్లు బాధితులు చెబుతున్నారు.

మహిళలను గౌరవించాలి

పొన్నలూరు: సమాజం బాగుకోసం త్యాగాలు చేసిన మహిళామూర్తులను ఆదర్శంగా తీసుకొని నేటి మహిళా లోకం ముందుకు సాగాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ కె.రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సావాల్లో భాగంగా అంగన్‌వాడీలు, మహిళా ఉద్యోగులు ప్రత్యేక ర్యాలీ నిర్వహిచంచి అవగాహన కల్పించారు. మహిళాభివృద్ధితోనే సమాజంలో పటిష్టమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీకన్నారు. ఎంఈఓ-2 హరిబాబు, అంగన్‌వాడీలు, పలువురు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై కోటయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకొని జీవితంలో ఉన్న శిఖరాలు అధిరోహించాలన్నారు.

కొండపి: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థినులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థినులతో గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సూసన్నకుమార్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ రాఘవేంద్రశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కె.ఉప్పలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పీసీపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోటయ్య



కొండపిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్



కనిగిరిలో విద్యార్థుల ర్యాలీ



కేజీబివిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కనిగిరిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని ఎన్జీవో కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో మ్యూజికల్ చైర్మన్, సైకిల్ ర్యాలీ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. సీడీపీఓ సరోజని, సూపర్‌వైజర్ సుమతి, కార్యకర్తలు పాల్గొన్నారు. కంచర్లవారిపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎంవీఎస్ పార్వతి, హెచ్‌ఎంలు కలువ విజయలక్ష్మి, డి.అనూరాధ, కార్యకర్తలు కళ్యాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: బాలికలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాలలో భాగంగా స్థానిక కేజీబివి విద్యాలయంలో, మండలంలోని కంబాలదిన్నె జెడ్పీహెచ్‌ఎస్‌లో మహిళాదినోత్సవం నిర్వహించారు. కేజీబీవీ ఎస్ఓ కె.సజన, మండ్లా శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్సై ప్రేమ్ కుమార్ అన్నారు.మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్లో మహిళలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిచంచారు. ఏఎస్ఐ అంకారావు, హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, రమేష్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు



గాజుల అలంకరణలో అంగాళ పరమేశ్వరమ్మ అమ్మవారు

టంగుటూరు: టంగుటూరులో వెంచేసి ఉన్న అంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మహా శివరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం, గాజుల అలకరణంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.


దశ దినకర్మలో పాల్గొన్న ఆదిమూలపు



కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: మండలంలోని మూగచింతల వైఎస్సార్ సీపీ నాయకుడు బచ్చల కోటు తండ్రి బచ్చల కృష్ణారావు దశదిన కర్మ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. బచ్చల కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోట్టిపాటి మురళి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు వీర వసంతరావు, సీనియర్ నాయకులు మండవ మాలకొండయ్య, రమేష్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

కొండపి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెట్లూరు శ్రీ సహజ నంద హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ను కరస్పాండెంట్ ఏ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యతను వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన నిర్వహించామన్నారు.

పించన్ల పంపిణీ పరిశీలన



వావిలేటిపాడులో పించన్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో పించన్ల పంపిణీని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. మండలంలోని వావిలేటిపాడు, దావగూడూరు, చింతలపాలెం గ్రామాల్లో పించన్ల పంపిణీని ఆయన పర్యవేక్షించారు. ఎంపీడీఓ రమణమూర్తి, ఏఓ యుగంధర్ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.